

# కేవలం కాగితాలకే పరిమితమైనవి... అను ఓ ఆదర్శం కథ!

* వేదగిరి రాంబాబు

కాలేజీలో చదువుకునే రోజుల్లో ఎన్నోసార్లు వ్యాస రచన పోటీల్లో బహుమతులుపొందాను!

మరెన్నోసార్లు డిబేట్లలో వాదించి అందరి ప్రశంసలూ పొందాను!!

ఇంకా చెప్పాలంటే

సీనియర్స్ దృష్టిలో ఆదర్శ విద్యార్థిని... సమకాలీనుల దృష్టిలో ఉన్నతుణ్ణి... జూనియర్స్ దృష్టిలో హీరోని... !!!

ఇన్ని రకాలుగా నేను అభినందించబడటాని కారణం...?

నా ఆదర్శాలు, ఆశయాలు!

అందుకే కాలేజీని వదిలిపెట్టినా వాటిని వదిలి పెట్టదలచుకోలేదు.

మనుషులు డబ్బుని సంపాదించాలి గాని డబ్బు మనుషుల్ని సంపాదించగూడదు... అన్నిటి కన్నా ముఖ్యమైనది మానవత్వం... ప్రేమతో దేనినయినా సాధించవచ్చు... ఇవి కేవలం కొన్ని అభిప్రాయాలు మాత్రమే!

అందుకే నేను ఉద్యోగస్థుణ్ణి అయిన తర్వాత డబ్బుకి అసలు విలువ ఇవ్వడమే మానేసాను. మిత్రులు, చుట్టాలు ఎవరితో తిరిగినా, వాళ్ళు పైసా ఖర్చు పెట్టినా నాకు ఇష్టం వుండేదికాదు. ఖర్చంతా నాదే! వాళ్ళు అభిమానాన్ని చూపిస్తేచాలు!

అందరికీ నేనంటే విపరీతమైన ప్రేమ!

ఇలా నా అభిప్రాయాలతో అందల మెక్కినట్లు మురిసిపోతున్న నాకు కన్య ఓ పెళ్ళిలో కనిపించింది.

నా ఆశయాలకు, ఆదర్శాలకు తగ్గ మనిషిగా అనిపించింది.

అంతే! ఏ మాత్రం సందేహించకుండా ఆమె ముందు విషయాన్ని వుంచేసాను — మీకిష్టమైతే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవడానికి మీవాళ్ళని సంప్రదిస్తానని!

కన్య కళ్ళు ఆనందంతో మెరిసాయి.

అందం, మంచి ఉద్యోగం వున్న యువకుడు వచ్చి ఏరి, కోరి 'నిన్ను పెళ్ళి చేసుకుంటాను' అంటే ఏ ఆడపిల్ల కళ్ళు మెరవవూ?

'ఆదివారం సాయంత్రం మీ ఇంటికి వస్తాను' అప్పటి కప్పుడే అపాయింట్‌మెంట్ ఇచ్చేసాను.

కన్య మరింత ఆనందపడింది.

ఆదివారం కోసం ఆమె ఎదురు చూసిందో లేదో గాని నేను మాత్రం తెగ ఎదురు చూసాను. ఆదివారం సాయంత్రం సరిగ్గా నాలుగ్గంటల కల్లా వాళ్ళ ఇంటి ముందు వాలాను.


గుమ్మంలోనే ఎదురొచ్చింది కన్య.

వాళ్ళ నాన్నగారికి పరిచయం చేసింది.

ఆయనా నన్ను చాలా ఆప్యాయంగా పలకరించారు. "పైన కూర్చుని మాట్లాడు కుందాం పదబాబూ..."

డాబా పైకి దారి తీసారు ఆయన. అనుసరించాను నేను.

కన్య అంతా ఆయనకి చెప్పేసినట్లే అనిపించింది. అందుకే ఎక్కువ ఉపోద్ఘాతంలేకుండా అసలు విషయంలోకి వచ్చేసాను.




"చాలా సంతోషం బాబూ... నీ లాంటి యువకుల అవసరం దేశానికి ఎంతో వుంది... సినిమాలు, షికార్లు అంటూ తిప్పకుండా ఇలా సూటిగా నాతో మాట్లాడడానికి రావడమే నీ వ్యక్తిత్వం చెబుతుంది..." ఆయన కాంప్లిమెంట్ నిజంగా నన్ను అందలాన్ని ఎక్కించేసింది.

నోట మాట రావడం మానేసింది.

అందుకే ఆయనే మాట్లాడసాగారు.

"డబ్బుకి అమ్ముడు పోయే కుర్రాళ్ళంటే నాకు వళ్ళు మంట. అందుకే నాకు ఎంత డబ్బున్నా కట్నంతోమాత్రం అల్లుణ్ణి కొనగూడదనే ఆదర్శానికి కట్టుబడ్డవాణ్ణి..."

నాకాలికి బ్రేక్ వేసాడాయన. అయినా నేను కిందపడలేదు. కారణం నేనూ ఆదర్శాలు గలవాణ్ణే కావడమే!

"అవునండీ... నాకు ఈ కట్నాలమీద సదభిప్రాయంలేదు..." నసిగాను.

"ఆవిషయం నువ్విలా డైరెక్ట్‌గా రావడంతోనే అర్థమవుతోంది బాబూ... కొంత మంది కట్నాలు వద్దంటూనే లాంఛనాలు లిస్ట్ చదువుతారు..."

"వాటికీ నేను విరుద్ధమండీ..."

"మా అమ్మాయి చాలా అదృష్టవంతురాలు బాబూ..."

ఆనంద పడిపోయాను.

"ఆడంబరంగా పెళ్ళి ఖర్చులు చెయ్యడం దండగ కదూ..."

నా నోటికి తాళం పడింది.

ఏమి మాట్లాడితే ఆయన కాళ్ళకి బంధం ఎలా వేస్తారో అనే భయంతో వూరుకుండి పోయాను. 'ఎలాంటివారు, ఎలా మారిపోయారు' అని కన్య ఎక్కడ ఛీత్కరించుకుంటుందోననే భయమూ నాలో లేకపోలేదు.పెళ్ళి పూట మాత్రం భోజనాలు ఏర్పాటు చేస్తాను... వెంటనే మనం ఆ హాల్‌ని ఖాళీ చేస్తే అద్దె తగ్గుతుందికదా"

ఆలోచనలో పడ్డాను.

ఇంట్లో అమ్మ, నాన్నగార్లను ఏదోవిధంగా కన్విన్స్ చేసి కట్నం లేకుండా చేయగలను. చెల్లెళ్ళని బతిమాలి లాంఛనాలు నేను ఇస్తానని సర్ది చెప్పగలను. కానీ పెళ్ళి చూడాలని ఎంతో దూరం నుంచీ వచ్చే బంధువుల్ని, మిత్రుల్ని వెంటనే తిరిగి వెళ్ళి పొమ్మని ఎలా చెప్పగలను?

అదే సందేహాన్ని ఆయన ముందు వెళ్ళగక్కాను.

“మాదు బాబూ మంది కోసం ప్రాకులాడడం నాకు ఇష్టం వుండదు. నా పద్ధతులు నావి...”


ఇంత వరకూ ఎంతో ఆదర్శవంతుడివని నన్ను ఒక్కో మెట్టూ పైకి ఎక్కిస్తున్న ఈయనేనా ఇలా మాట్లాడుతున్నది?

ఆయనంత నిర్మొహమాటంగా మాట్లాడే సరికి నాకూ కోపం వచ్చింది. ఓ దణ్ణం పెట్టి లేచి వద్దామని పించింది.

కానీ అలా చేస్తే కన్య నన్ను ఎంత నీచంగా అనుకుంటుంది! ఈ ఆలోచన నన్ను తొందరపడ నివ్వలేదు.

ఒక ఆదర్శప్రాయుడుగానే నిలబడాలన్న నా ఆశ ఏమై పోతుంది!?

అందుకే ఆయన చెప్పినవాటి అన్నింటికీ వప్పేసుకుని ‘మంచివాడు’ అనే బిరుదుని తీసుకుని మరీ ఇంటికి బయల్దేరాను.




ఈ విషయాలన్నింటినీ చెప్పే సరికి ఇంట్లో బాంబులు పేలినట్లయింది.

అందరూ నన్నో, ‘విదేశీహస్తాన్ని’ మాసినట్లు మాడసాగారు. ఎలాంటివాడు ఎలా మారిపోయాడు అనుకున్నారు అంతా ముక్తకంఠంతో.

“ఆల్‌రైట్ సరే... నీ ఆదర్శాల కోసం నేను పైసా కట్నం తీసుకోను సరే... కానీ మా చెల్లెలికి కూడా పైసా కట్నం ఇవ్వకుండా పెళ్ళి చేస్తావా?” సూటిగా అడిగారు నాన్నగారు.

“ఆ” అన్నాను.

“దేశం నీలాంటి చవటలతో నిండిలేదురా” ఆయన కోపం పెరిగింది.

“ఒకవేళ కట్నం ఇవ్వాల్సివచ్చినా ఆ సంగతి నేను చూసుకుంటాను...”

“నా పిల్లపెళ్ళి నేను చేసుకోలేని వాణ్ణనుకున్నావా! నీకా శ్రమ అక్కర్లేదులే నువ్వు మాత్రం ఒకటి గుర్తుంచుకో. నన్ను కాదని ఈ పెళ్ళికి వప్పుకుంటు న్నావు కాబట్టి ఇక ముందు నా అండ నీకుండదు. అదిమాత్రం గుర్తుంచుకో...”

ఇలా నా ఆదర్శోపాఖ్యానం మొదటి ఆధ్యాయం. ముగిసింది.

“మాదు అల్లుడూ! పెళ్ళి అయిపోయింది. ఇప్పుడు కన్య నా కూతురుకాదు. నీ భార్య” అన్న మా మామగారి మాటల్లోని అసలు విషయం అప్పుడు నాకు అర్థంకాలేదు.

‘నీ అంతట నువ్వు వచ్చి కోరితేనే నా పిల్లని నీకిచ్చాను. ఇక నా బాధ్యతేమీలేదు. మళ్ళీ మాట్లాడితే ఆమెనే అభిమానించే నా బాధ్యత కూడా నీదే!’ అన్న అర్థం ఆ మాటలదని తర్వాత అర్థమైంది.

కోరి రావడంతో మామగారికి అలుసయ్యావనే విషయం చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. అప్పుడు తెలుసుకుని లాభం లేదు.

‘నాకు ఇంకా ఆడపిల్లలున్నారు. కాబట్టి ఇంతవరకూ నీకు చేసిందే గొప్ప...’ కన్యని నా చేతిలో పెట్టి నా కాళ్ళు కడగడానికి బదులు తన చేతులు కడిగేసుకున్నాడు ఆ పెద్దమనిషి. ఏదో మాట్లాడబోతే ‘పెళ్ళికాగానే ఎలాంటి వాడివి ఎలా మారిపోయావు’ నిష్ఠూరాలాడి తప్పించుకున్నాడాయన.

ఇంట్లో వాళ్ళకి ఈ విషయాలు తెలిస్తే మరింత చులకనైపోనూ! నువ్వేగా ఏరికోరి ఆ సంబంధాన్ని చేసుకున్నది! అని నిలదియ్యరూ.

అందుకే అంతా దిగమింగు కోవడం తప్పని సరైంది.

ఎటూ సపోర్ట్ లేకపోవడంతో ఇబ్బందులు మొదలయ్యాయి.

పురుళ్ళు... పేరంటాలు ...!

ఇది వరకటిలా డబ్బు చేతిలో ఆడడంలేదు. దాంతో స్నేహితులకు, బంధువులకు నాలోమూర్తు కనిపించసాగింది.

మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి దిగజారడంతో అడపాదడపా ఎవర్నో




ఒకర్ని డబ్బు కోసం ఆశ్రయించాల్సిన పరిస్థితులూ ప్రారంభమయ్యాయి.


అంతే! వాళ్ళందరూ మరింత దూరమవసాగారు.

‘ఎలాంటి వాడు ఎలా మారిపోయాడు!’ ముక్కున వేలేసుకున్నారు.

* * *

ఆదర్శాల వళ్ళచక్రంలో రోజులు భారంగా దొర్లుతున్నాయి. రోజురోజుకీ వంటరితనం పెరిగిపోతోంది.

నాగురించే ఆలోచిస్తున్నా గానీ తన గురించి ఆలోచించడంలేదనే విషయం




ఉభాండ రూపంలో నాముందు దొర్లించింది హఠాత్తుగా మా ఆవిడ.

తెలుగు సినిమాలు తెగచూడడం, కలలు కనడం ఆమె హాబీ అని పెళ్ళయిన తర్వాతే తెలుసుకున్నాను.

నా కళ్ళు బైర్లు కమ్మేయి.

తన గురించి ఆలోచించడం లేదా! అసలు తనీ పరిస్థితులన్నీ ఎవరికోసం ఎదుర్కొంటున్నట్లు?

పరిస్థితినంతా ఆమెకు వివరించాలనుకున్నాను. “పెళ్ళికి ముందే వీటన్నింటి గురించీ ఆలోచించాల్సింది. మీ అంతటికి మీరే నా వెంటపడ్డారు. తీరా ఇప్పుడు...” ఆమె గొంతు బొంగురు పోయింది.

ఎలాంటి వారు ఎలా మారిపోయారూ!? తనూ అనేసింది.

నెత్తిన కర్రతో మోదినట్లయింది.

కళ్ళుగిర్రున తిరిగాయి. అయినా తమాయించుకున్నాను.

నేను ఏ మాత్రం మారలేదు. ఆ విషయం నాకు తెల్సు. నా ఆదర్శాలని నేను విడిచి పెట్టదలచుకోలేదు. పెట్టను కూడా!

అందుకే ఇప్పుడు నేను చాలా మంది దృష్టిలో అసమర్థుడిని!

ఇంకొంత మంది దృష్టిలో బ్రతకడం చాతకాని వాడిని!!

అవునుమరి, ఇప్పుడు నేనుంటున్నది కాలేజీ గోడల మధ్య కాదు విశాల ప్రపంచంలో!!!

*